# గుస్సాడి నృత్యము

గుస్సాడి అంటే గురువు. గుస్సాడీ నృత్యం గిరిజనులలో గోండ్స్ తెగవారు చేసే నృత్యం. గోండ్స్ ఆంధ్రప్రదేశ్‌లో ఆదిలాబాద్ జిల్లాలో ఉన్నారు. గ్రామాలలో దేవుని విగ్రహాలు గ్రామపెద్ద ఇంటిలో అటకపైపెడతారు. ఆషాఢమాసంలో పున్నమినాడు ఊర్లోని వారందరూ వచ్చి అటకమీదున్న దేవుని క్రిందికిదించి పూజలు చేసి కోలాటం ఆడుతారు. రోజూ పూజలు చేస్తూ కోలాటం ఆడుతూ ఉంటారు. దీపావళి అమావాస్య 10 రోజులు ఉందనగా గుస్సాడీలు (గురువులు) వేషాలు ధరించి ఒక ఊరినుంచి ఇంకొక ఊరికి వెళ్లి నృత్యం చేస్తూవుంటారు. వీరు తలకు నెమలి ఈకలతో తయారుచేసిన కిరీటం పెట్టుకుంటారు. నెమలి కిరీటం మధ్యలో అద్దం ఉంటుంది. ఈ నెమలి ఈకలు 5000 ఉంటాయని చెబుతారు. చేతిలో రోకలిపట్టుకొని కాళ్లపైకి అంగీ ధరించి నృత్యం చేస్తూవుంటారు. వీరికి ప్రక్క వాద్యాలుగా :

డప్పులు - 4, భేప్రే, కాళికొమ్ము



వీరు నృత్యం మొదలుపెట్టునప్పటి నుండి అనగా దీపావళి అమావాస్య ముందు పదిరోజుల నుండి దీక్షతో ఉంటారు. అందరూ కలసి ఒకాకులోనే భోజనంచేస్తారు. ఆ 10 రోజులు మొహంకడుక్కోరు, స్నానంచెయ్యరు అంగీవక్కటే కట్టుకుంటారు. జింకతోలుమీద పడుకుంటారు. వీరు దీక్షలో ఉన్నప్పడు ఎవరికైన గ్రామస్థులకు జబ్బుచేస్తే నీళ్లలో రోకలివేసి త్రిప్పి తీర్థంవలె ఇస్తారు. ఆ నీరుతాగితే జబ్బు తగ్గిపోతుందని వారి నమ్మకం. ఒక ఊరి గుస్సాడీలు ఇంకొక ఊరికి, వారు ఇక్కడకూ వస్తూంటారు. గ్రామంలో ఏ విధమైన జబ్బులు రాకుండా ఉండాలని, సుభిక్షంగా పంటలు పండాలని ఈ నృత్యం చేస్తారు. దీపావళి పండుగ అయినతర్వాత ఊర్లోని ప్రజలంతా దేవునికి

స్నానంచేయించి విప్పచెట్టుక్రింద దేవునిపెట్టి కొలుపులు కొలుస్తారు. అక్కడ అందరూ భోజనంచేసి దేవుని మళ్లీ గ్రామపెద్ద ఇంటివద్దకు తీసుకొనివచ్చి రెండుగంటలసేపు కోలాటంనృత్యం చేసి దేవుడిని ఇంట్లో ఒకప్రక్కగా పెట్టి దీపారాధనచేస్తారు. ఆ రాత్రి గ్రామపెద్ద ఇంటివద్దనేవుంటారు. ప్రొద్దునే లేచి పూజలుచేసి దేవుణ్ణి అటక ఎక్కిస్తారు. అంతటితో ఆ కార్యక్రమము సమాప్తమవుతుంది.

గుస్సాడి నృత్యం యొక్క ముఖ్యోద్ధేశం గురు సాంప్రదాయం నిలుపుట మరియు గ్రామాలలో జబ్బులు ఏమీ రాకుండా శాంతికొరకు దైవశక్తిని మేల్కొలపడం. ఆ నమ్మకం వారి మనస్సులో నాటుకుపోవడంవల్ల రోగాలబారి పడకుండా వారి ఆత్మశక్తి వారిని కాపాడుతుంది.